# నేడు కామారెడ్డికి గులాబీ బాస్



- నామినేషన్ వేయనున్న కేసీఆర్
- డిగ్రీ కళాశాల మైదానంలో ప్రజా ఆశీర్వాద సభ
- కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు
- సభకు పోటెత్తనున్న ప్రజానీకం

నిజామాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు (గురువారం) కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం గజ్వేల్‌లో నామినేషన్ వేసి మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. నామినేషన్ పత్రాలను ఆర్డీవో కార్యాలయంలో ఆర్వోకు స్వయంగా కేసీఆర్ అందిస్తారు. అనంతరం డిగ్రీ కళాశాల మైదానంలో ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తారు. కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్న తర్వాత తొలిసారిగా ఇక్కడికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు జన హారతి పట్టేందుకు నిర్ణయించారు. ఘనంగా స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. సీఎం బహిరంగ సభపై ఇప్పటికే కామారెడ్డి నియోజకవర్గం వ్యాప్తంగా ప్రచారం చేయగా, కేసీఆర్‌ను స్వయంగా చూసేందుకు, ఆయన చెప్పే విషయాలను ఆలకించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఎనిమిది మండలాల నుంచి పెద్దసంఖ్యలో తరలిరానున్న జనం కోసం బీఆర్ఎస్ పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది.

**అభ్యర్థిత్వం తర్వాత తొలిసారి..**

పదేండ్లలో కామారెడ్డి ప్రాంతానికి కేసీఆర్ చాలాసార్లు వచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. నియోజకవర్గం గొప్పతనాన్ని కొనియాడడంతోపాటు ఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి నెరవేర్చారు. ఈసారి పర్యటన మాత్రం ప్రత్యేకతను సంతరించుకున్నది. కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి స్వయంగా ఆయనే పోటీ చేస్తుండడంతో గులాబీ బాస్ రాకపై అందరిలోనూ ఆసక్తి నెలకొన్నది. తన అభ్యర్థిత్వం ఖరారయ్యాక కేసీఆర్ రాక ఇదే తొలిసారి కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులంతా పార్టీ అధినేతను ఘనంగా ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్నారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నట్లు ప్రకటన రావడమే తరువాయి.. స్థానిక ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి, ఏకగ్రీవ తీర్మానాలతో హోరెత్తించారు. స్వచ్ఛందంగా వచ్చిన మద్దతులతో బీఆర్ఎస్‌లో జోష్ నింపగా, కేసీఆర్ రాకతో.. ఇప్పుడు రెట్టించిన ఉత్సాహం కనిపిస్తున్నది.

**నామినేషన్ వేయనున్న కేసీఆర్..**

కామారెడ్డి నియోజకవర్గానికి కేసీఆర్ స్వయంగా తన నామినేషన్ పత్రాలను సమర్పించనుండగా, కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు సైతం హాజరయ్యే అవకాశం ఉన్నది. స్పీకర్ పోచారంతోపాటు మంత్రి ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు కేసీఆర్ నామినేషన్ ప్రక్రియలో భాగం కానున్నారు. నామినేషన్ దాఖలుకు ముందు సిద్దిపేట జిల్లా నంగనూర్ మండలం కోనాయిపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయడం కేసీఆర్‌కు సెంటిమెంట్. నాలుగున్నర దశాబ్దాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని గులాబీ దళపతి మొన్ననే పూర్తి చేశారు. గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి దేవదేవుడి ఆశీర్వాదాలను పొందారు. సన్నిహితులు, కుటుంబీకులు, గులాబీ పార్టీ శ్రేణులు హాజరైన ఈ కార్యక్రమం.. అట్టహాసంగా పూర్తికాగా, నామినేషన్ పత్రాల సమర్పణ మిగిలింది. కేసీఆర్ మొదటగా గజ్వేల్‌లో నామినేషన్ దాఖలు చేస్తారు. అక్కడినుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కామారెడ్డికి చేరుకొని నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేస్తారు.

**జనాల్లో ఆసక్తి..**

కేసీఆర్ రాక సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గ ప్రజల్లో అమితాసక్తి ఏర్పడింది. ఉద్యమ నాయకుడు, తెలంగాణ సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా రికార్డుకెక్కిన కేసీఆర్.. తమ ప్రాంతం నుంచి పోటీ చేస్తుండడంపై ఇప్పటికే సర్వత్రా చర్చనీయాంశమైంది. కేసీఆర్ రాకతో ప్రజలు.. కామారెడ్డి దిశ, దశ మారుతుందనే నమ్మకంతో ఉన్నారు. రాష్ట్రంలోనే అత్యుత్తమ నియోజకవర్గంగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఈ అంచనాల నేపథ్యంలో ప్రజా ఆశీర్వాద సభ వేదికగా కామారెడ్డి నియోజకవర్గానికి బీఆర్ఎస్ అధినేత వరాలు ప్రసాదించే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాంత అవసరాలను తీర్చడంతోపాటు గెలిచిన తర్వాత సీఎం హోదాలో కామారెడ్డి ప్రాంతానికి తలపెట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల సరళిని కేసీఆర్ వివరిస్తారని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నారు.



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ముజీబుద్దీన్, నిట్టు వేణుగోపాల్ రావు తదితరులు



## ఆర్మూర్‌కు కేటీఆర్..

- జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి హాజరుకానున్న మంత్రి



ఆర్మూర్, నవంబర్ 8: ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన జీవన్‌రెడ్డి.. మూడోసారి నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఆయనకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌తోపాటు ఎమ్మెల్సీ కవిత, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మంత్రి కేటీఆర్ ఆర్మూర్‌కు చేరుకొని ఆలూర్ బైపాస్ రోడ్డులో ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా సుమారు 50వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు చేశారు. జీవన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

## ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి

- పర్యవేక్షించిన హైదరాబాద్ మాజీ మేయర్ రామ్మోహన్, ప్రభుత్వ విప్ గంప, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్

కామారెడ్డి, నవంబర్ 8 : కామారెడ్డిలో సీఎం కేసీఆర్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు తదితరులు పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సీఎం కేసీఆర్ బహిరంగ సభకు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌లో కల్లోలం

- సీనియర్లకు మొండి‘చేయి’
- పారాచూట్లకే టికెట్ల కేటాయింపు
- మనస్తాపానికి గురైన కాసుల, గంగారాం
- ఆత్మహత్యాయత్నం చేసిన బాలరాజు
- స్వతంత్రుడిగా బరిలోకి గంగారాం

### ఇండిపెండెంట్‌గా బరిలోకి: గంగారాం

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోరిక మేరకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావు ఎస్సీ కాదని, బీసీ అని చెప్పారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని తన నివాసంలో గంగారాం బుధవారం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోరిక మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యకర్తల ఆశీర్వాదంతోనే నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యానన్నారు. కార్యకర్తల నిర్ణయంతోనే కాంగ్రెస్ పార్టీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు వేస్తామన్నారు. కాంగ్రెస్ తరఫున ఎందుకంటే లక్ష్మీకాంతారావు ఎస్సీ కాదు బీసీ అని వెల్లడించారు.



పెద్ద కొడప్‌గల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగారాం

బాన్సువాడ/పెద్ద కొడప్‌గల్, నవంబర్ 8: కాంగ్రెస్‌లో టికెట్ల లొల్లి రచ్చకెక్కింది. బాన్సువాడ హస్తం పార్టీలో బుధవారం ఒక్కసారిగా కలకలం చెలరేగింది. సీనియర్లను కాదని పారాచూట్లకు పెద్దపీట వేయడంపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసమ్మతి, అసంతృప్తి వెల్లువెత్తింది. ఏండ్ల నుంచి కాంగ్రెస్ కోసం పనిచేస్తున్న తమను కాదని కొత్త వారికి టికెట్లు ఇవ్వడంపై సీనియర్ నాయకుడు కాసుల బాలరాజు మనస్తాపానికి గురయ్యారు. హస్తం పార్టీ తీరును నిరసిస్తూ ఆమరణ దీక్షకు కూర్చున్న కాసుల.. అంతలోనే ఆత్మహత్యాయత్నం చేశారు. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని తట్టుకోలేక బుధవారం తన ఇంట్లో పురుగుల మందు తాగారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, అనుచరులు వెంటనే బాన్సువాడ దవాఖానకు, అక్కడి నుంచి నిజామాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మరోవైపు, కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గంగారాం.. జుక్కల్ నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. సీనియర్లకు మొండి‘చేయి’ చూపి, ఇటీవలే పార్టీలోకి వచ్చిన వారికి టికెట్లు కేటాయించడంపై హస్తం నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు.

**ఆమరణ దీక్ష.. ఆపై ఆత్మహత్యాయత్నం**

బాన్సువాడ టికెట్‌ను ఆశించిన కాసుల బాలరాజుకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపింది. ఇటీవలే బీజేపీ నుంచి పార్టీలోకి వచ్చిన ఎల్లారెడ్డికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కాసుల ఆత్మహత్యాయత్నం చేశారు. బాన్సువాడలోని తన నివాసంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కన్నీరుమున్నీరయ్యారు. పదేండ్లుగా కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి పోరాటాలు చేసిన తనను కాదని, ఎక్కడి నుంచో వచ్చిన ఏనుగు రవీందర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంపై ఆయన మండిపడ్డారు. పార్టీ కోసం కష్టపడిన తనకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ తీరును నిరసిస్తూ ఇంట్లోనే ఆమరణ దీక్ష చేపడుతున్నట్లు ప్రకటించారు. కార్యకర్తలతో కలిసి దీక్ష ప్రారంభించారు. అయితే టాయిలెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లోకి వెళ్లిన కాసుల.. కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని తట్టుకోలేక పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు, అనుచరులు ఆయనను బాన్సువాడ ఏరియా దవాఖానకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం భాస్కర్‌రెడ్డి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. కాసులను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాలరాజు త్వరగా కోలుకోవాలని భాస్కర్‌రెడ్డి ఆకాంక్షించారు. అయితే, వైద్యుల సూచన మేరకు కాసులను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, 24 గంటలు గడిస్తేగాని ఆయన ఆరోగ్యం గురించి ఏం చెప్పలేమని వైద్యులు తెలిపారు.